సాక్షి ఖమ్మం

శనివారం । 23 । ఆగస్టు । 2025



సర్వేలతోనే సరి

ప్రభుత్వ వసతిగృహాలు, గురుకులాల్లో సమస్యల గుర్తింపునకు సర్వేలు చేస్తున్నా పరిష్కారం మాత్రం జరగడం లేదు. 8లో



కమిషనర్ వచ్చారు.. వెళ్లారు!

వైరా మున్సిపల్ కమిషనర్‌గా గురులింగం బాధ్యతలు స్వీకరించాక ఎమ్మెల్యే సూచనలతో తిరిగి వెళ్లిపోవడం చర్చకు దారి తీసింది. 8లో

గరిష్టం / కనిష్టం 33° / 24°

వాతావరణం

జిల్లాలో శనివారం మధ్యాహ్నం వరకు సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆతర్వాత వాతావరణంలో మార్పు వస్తుంది.

న్యూస్‌రీల్

ఈఎంటీ, కెప్టెన్ ఉద్యోగాలకు దరఖాస్తులు

ఖమ్మంవైద్యవిభాగం: ఈఎంఆర్ఐ 108 వాహనంలో ఎమర్జెన్సీ టెక్నీషియన్(ఈఎంటీ), 102 అమ్మ ఒడి వాహనంలో కెప్టెన్(డ్రైవర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన పురుష అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ జిరాక్స్‌తో పాటు ఆధార్ కార్డుతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని 108 కార్యాలయంలో ఈనెల 25వ తేదీ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఈఎంటీ పోస్టుకు బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం, బీఎస్సీ ఎంఎల్‌టీ, బీ ఫార్మసీ పూర్తిచేసిన వారు, డ్రైవర్ పోస్టుకు 10 తరగతి పాసై, 22 – 35 ఏళ్ల వయస్సు, కనీసం మూడేళ్ల అనుభవం, ఎల్ఎంవీ బ్యాడ్జ్ కలిగిన వారు అర్హులని వెల్లడించారు. ఇతర వివరాలకు 90102 51025, 91549 18117 నంబర్‌లను సంప్రదించాలని శివకుమార్ సూచించారు.

యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి



భగవత్‌వీడులో పశువుల కొట్టాన్ని ప్రారంభిస్తున్న జేసీ కృష్ణ

నేలకొండపల్లి/కూసుమంచి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ జాయింట్ కమిషనర్ కె.కృష్ణ సూచించారు. నేలకొండపల్లి మండలం మోటాపురం, కూసుమంచి మండలం ఈశ్వరమాధారం, భగవత్‌వీడు గ్రామాల్లో పనుల జాతరలో భాగంగా శుక్రవారం పర్యటించిన ఆయన ఉపాధి నిధులతో చేపట్టే పనులను ప్రారంభించి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతీ పల్లెలో రహదారులు నిర్మిస్తుండగా నాణ్యతపై ఉద్యోగులు దృష్టి సారించాలని సూచించారు. విధుల్లో ఎవరు నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని హెచ్చరించారు. ఈకార్యక్రమాల్లో డీఆర్‌డీఓ ఏపీడీ శ్రీదేవి, ఎంపీడీఓలు ఎం.యర్రయ్య, రాంచందర్‌రావు, ఎంపీఓ శివ, ఏపీఓలు ఆర్.సునీత, అప్పారావు, ఈసీ శేషగిరిరావు పాల్గొన్నారు.

రూ.9 కోట్లతో బీసీ హాస్టళ్లకు భవనాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీడబ్ల్యూఓ జ్యోతి

సత్తుపల్లిటౌన్: జిల్లాలోని వి.వెంకటాయపాలెం, ముస్తాఫనగర్ బాలుర హాస్టల్, ఖమ్మంలోని బాలికల బీసీ హాస్టళ్లకు రూ.3కోట్ల చొప్పున రూ.9 కోట్ల నిధులతో నూతన భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారి జి.జ్యోతి తెలిపారు. సత్తుపల్లిలోని బీసీ హాస్టళ్లను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీసీడబ్ల్యూఓ మాట్లాడుతూ పెనుబల్లి, సత్తుపల్లి, తిరుమలాయపాలెం, చిన్నకోరుకొండి హాస్టళ్లకు భవన నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదించామని తెలిపారు. హాస్టళ్ల పునఃప్రారంభమైన రోజే విద్యార్థులకు బెడ్‌షీట్లు, కార్పెట్లు, నోట్‌పుస్తకాలు అందించామన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని హాస్టళ్లలో ఎమ్మెల్యే రాగమయి చొరవతో ఫ్యాన్లు, లైట్లు, కుర్చీలు అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా అన్ని కళాశాల హాస్టళ్లకు పుస్తకాలు సమకూర్చామని చెప్పారు. ఈసందర్భంగా ఆమె హాస్టళ్లలోని సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఏబీసీడీఓ ఐ.గ్రీసమ్మ, వార్డెన్లు ఎం.వెంకటేశ్వర్లు, బి.హేమలత, ఎ.అశోక్‌రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

నేటి నుంచి జాతీయ క్రీడా దినోత్సవ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యాన శనివారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌ఓ టి.సునీల్ రెడ్డి తెలిపారు. ఈనెల 23వ తేదీన మధిర, ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం, వైరా, కల్లూరులో అండర్–10 బాలబాలికలకు స్కేటింగ్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తారు. అలాగే, 24న అన్ని కేటగిరీల్లో పోటీలు, 25న పటేల్ స్టేడియంలో హెల్త్ క్యాంప్, 26న వెటరన్ క్రీడాకారులకు పోటీలు నిర్వహించనున్నారు. అంతేకాక 27న సాంస్కృతిక కార్యక్రమాలు, 28న క్రీడారంగంపై డిబేట్, 29న జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు, 30న ప్రేరణ తరగతులు, 31వ తేదీన సైక్లింగ్ ర్యాలీ ఉంటాయని డీవైఎస్‌ఓ తెలిపారు.



తరచూ ప్రమాదాలు జరుగుతున్న ఖమ్మంలోని రాపర్తినగర్ బ్రిడ్జి రోడ్డు

డేంజర్.. యమడేంజర్

జిల్లాలో ఇటీవల రోడ్డు ప్రమాదాల సంఖ్య విపరీతంగా పెరిగింది. గడిచిన ఏడు నెలల్లో 607 ప్రమాదాలు జరగ్గా.. 225 మంది మృతి చెందారు. దీంతో ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీస్, పంచాయతీ రాజ్, రవాణా, రెవెన్యూ, ఎన్‌హెచ్ఏఐ, ఆర్‌అండ్‌బీ అధికారులు సమన్వయంతో జాతీయ, రాష్ట్ర, గ్రామీణ రహదారులపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించారు. మొత్తంగా 43 బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నియంత్రణపై దృష్టి సారించారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఈ ఏడాది ఏడు నెలల్లో 607 రోడ్డు ప్రమాదాలు

- జిల్లాలో 43 బ్లాక్‌స్పాట్లు గుర్తించిన పోలీసు అధికారులు
- అన్ని శాఖల సమన్వయంతో నియంత్రణ చర్యలకు శ్రీకారం
- బారికేడ్లు, సూచిక బోర్డులు, స్టాపర్లు, సిగ్నల్ లైట్ల ఏర్పాటు

హడలెత్తిస్తున్న రద్దీ, వేగం

రోడ్లపై వాహనాల రద్దీకి తోడు పలువురు వాహనదారులు విపరీతమైన వేగంగా వెళ్తుండడం.. రహదారులపై గుంతలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. జాతీయ, రాష్ట్రీయ, ఇతర ప్రధాన రహదారులపై ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరిగింది. హైవేలపై నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తుండడం, కొందరు మద్యం మత్తులో వాహనాలు నడుపుతుండడం ప్రమాదాలకు కారణమవుతోంది. వీటికి తోడు మూలమలుపులు, గుంతలు పడిన చోట ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఇక ఎక్కడైనా వాహనాలు బ్రేక్ డౌన్ అయినప్పుడు రాత్రివేళ ఇవి కనిపించక ఇతర వాహనదారులు ఢీకొడుతుండడంతో రహదారులు రక్తమోడుతున్నాయి.

వందల్లో మృతులు

ఈ ఏడాది ఏడు నెలల్లో 607 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ప్రమాదాల బారిన వాటిలో అన్ని రకాల వాహనాలు ఉండగా.. 225 మంది మృతి చెందడమే కాక 526 మంది గాయపడ్డారు. ఇందులో కేవలం ద్విచక్రవాహన ప్రమాదాలు 150 ఉన్నాయని, ఈ ప్రమాదాల్లో 69 మంది మృతి చెందినట్లు నివేదికలు చెబుతున్నాయి. రోడ్డుపై వాహనదారులు వేగ నియంత్రణ పాటించకపోవడం.. ప్రధానంగా ద్విచక్ర వాహనదారుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరుగుతున్నాయనే వాదన ఉంది.

శాఖల సమన్వయంతో..

జిల్లాలో రోడ్డు ప్రమాదాలకు కారణాలు, నియంత్రణపై పోలీస్, పంచాయతీ రాజ్, రవాణా, రెవెన్యూ, ఎన్‌హెచ్ఏఐ, ఆర్‌అండ్‌బీ అధికారులు సమీక్షించారు. ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గించేలా క్షేత్రస్థాయిలో సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు. రాత్రి వేళ పోలీస్ శాఖ ఆధ్వర్యాన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేస్తూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. మరోపక్క ఇతర శాఖలు కూడా తమ పరిధిలో చర్యలు చేపట్టారు.

అక్కడే అత్యధికంగా..

జిల్లా రోడ్డు భద్రతా కమిటీ ప్రమాదాల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించింది. ఇందులో 43 ప్రాంతాలను బ్లాక్‌స్పాట్లుగా గుర్తించారు. వీటిలో 33 ప్రాంతాలు జాతీయ రహదారులపైనే ఉండడం గమనార్హం. ఖమ్మంరూరల్ మండలంలో ఏడు, కొణిజర్ల మండలంలో ఆరు, సత్తుపల్లి, వైరా మండలాల్లో నాలుగు చొప్పున బ్లాక్‌స్పాట్లను గుర్తించారు. ఇక్కడ వేగ నియంత్రికలు, సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, జాతీయ, రాష్ట్ర, ఇతర ప్రధాన రహదారులకు గ్రామాలు, ఇతర ప్రాంతాల రోడ్లు అనుసంధానమయ్యే చోట వేగ నియంత్రికలు ఏర్పాటుచేశారు. అంతేకాక హెచ్చరిక బోర్డులు, దారి మలుపులను తెలిపే సూచిక బోర్డులు, ట్రాఫిక్ సిగ్నళ్లు సైతం ఏర్పాటయ్యాయి.

అత్యధిక హాట్‌స్పాట్లు ఉన్న ప్రాంతాలు

మండలం / ప్రాంతం	హాట్ స్పాట్లు
ఖమ్మంరూరల్	07
కొణిజర్ల	06
కూసుమంచి	04
వైరా	04
సత్తుపల్లి	04
తల్లాడ	03
రఘునాథపాలెం	03
ఖానాపురం హవేలి	03

మూడు నెలల్లో ముగ్గురు మృతి



కొణిజర్ల పీఎస్ సమీపాన హైవేపై గుంతలు

ఖమ్మం – సత్తుపల్లి జాతీయ రహదారిపై కొణిజర్ల పోలీస్‌స్టేషన్ సమీపాన నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గత మూడు నెలల కాలంలో ఇక్కడ 12ప్రమాదాలు జరగ్గా ముగ్గురు మృతి చెందారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రాంతంలో రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చకుండా మరమ్మతులతోనే సరిపెడుతుండడం.. మళ్లీ రెండు, మూడు నెలల్లో యథాస్థితికి చేరుతుండడం ప్రమాదాలకు కారణమవుతోంది. వారంలో సగటున రెండు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నందున జాతీయ రహదారి అధికారులు ఈ స్థలాన్ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తించి నియంత్రణపై దృష్టి సారించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు.



జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేయిస్తున్నాం. అలాగే ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అన్ని శాఖల సమన్వయంతో హెచ్చరికల బోర్డులు ఏర్పాటుచేయించాం. ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నందున హెల్మెట్ తప్పనిసరి ధరించేలా తనిఖీల్లో సూచనలు చేస్తున్నాం. అలాగే, జాతీయ రహదారులపై వెళ్లేవారు వేగనియంత్రణ పాటిస్తే ప్రమాదాల సంఖ్య తగ్గుతుంది.

– సునీల్‌దత్, పోలీసు కమిషనర్

సామాజిక, వ్యక్తిగత ఆస్తుల సృష్టి

- రూ.67 కోట్లతో జిల్లాలో ఉపాధి హామీ పనులు
- 'పనుల జాతర' ప్రారంభంలో కలెక్టర్ అనుదీప్



బూడిదంపాడులో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

రఘునాథపాలెం: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులతో సమాజానికే కాక వ్యక్తులకు ఉపయోగపడే ఆస్తుల సృష్టి జరగాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. 'పనుల జాతర'లో భాగంగా శుక్రవారం ఆయన రఘునాథపాలెం మండలం బూడిదంపాడులో పర్యటించారు. వంద రోజుల పనిదినాలు పూర్తి చేసిన కూలీలతో పాటు దివ్యాంగురాలు పేరం రమాదేవిని సన్మానించడమే కాక లబ్ధిదారులు అంగడాల నాగమణి, కేతినేని ద్రౌపదికి చెక్కులు అందజేశారు. అనంతరం ఉపాధి హామీ నిధులు రూ.3లక్షలతో నిర్మించిన పౌల్ట్రీ షెడ్డు, రూ.లక్షతో నిర్మించిన పశువుల షెడ్డును కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. ఈ ఏడాది జిల్లాలో రూ.67 కోట్ల వ్యయంతో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామసభల తీర్మానాలతో పనులు చేపడుతున్నందున అంతా పర్యవేక్షించాలని సూచించారు. గతంలో ఈ పథకం ద్వారా పూడికతీత వంటి పనులే చేపట్టేవారని, ఇప్పుడు పౌల్ట్రీ, పశువుల షెడ్లు, తోటల పెంపకం, రహదారులు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. రైతులు పంటలు సాగు చేస్తూనే పశువుల పెంపకంతో అదనపు ఆదాయం పొందాలని కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో డీఆర్‌డీఓ ఎన్.సన్యాసయ్య, డీఎల్‌పీఓ రాంబాబు, ఎంపీడీఓ అశోక్‌కుమార్, తహసీల్దార్ శ్వేత, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వరరావు, మార్కెట్ డైరెక్టర్ నర్సయ్య, ఏపీఓ పద్మయ్యనాయుడు, గ్రామపంచాయతీ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల కూలీలకు ఉపాధి

ఖమ్మంమయూరిసెంటర్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా గ్రామీణ ప్రాంత నిరుపేద కూలీ కుటుంబాల పనులు కల్పిస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో వెల్లడించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 60.24 లక్షల పనిదినాలు కల్పించి రూ.127.06 కోట్లను కూలీల వేతనంగా చెల్లించినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 25.85 లక్షల పనిదినాలు కల్పించి రూ.70.14 కోట్ల వేతనం చెల్లింపు పూర్తయిందని పేర్కొన్నారు. కాగా, పనుల జాతరలో భాగంగా జిల్లాలోని 571 గ్రామాలలో శుక్రవారం రూ.8.78 కోట్ల విలువైన 626 పనులను ప్రారంభించడమేకాక కొత్త పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.

ఇండోర్‌లో కేఎంసీ బృందం పర్యటన

వ్యర్థాల నిర్వహణ, అభివృద్ధి, పౌర సేవలపై పరిశీలన



వాహనాల ట్రాకింగ్ వివరాలు వెల్లడిస్తున్న ఇండోర్ ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యాన కార్పొరేటర్లు, అధికారుల బృందం ఇండోర్‌లో తమ పర్యటన కొనసాగించారు. ఇండోర్‌లో గురువారం మేయర్ నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా ఆధ్వర్యాన పర్యటించగా.. అక్కడ ఇంటింటా చెత్త సేకరణ, చెత్త వాహనాల ట్రాకింగ్, వ్యర్థాల రీసైక్లింగ్‌పై ఆరాతీశారు. స్వచ్ఛతలో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్న ఇండోర్‌లో చెత్త సేకరణకు అవలంబిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. వ్యర్థాలను సేకరించే వాహనంలో ఆరు బ్లాక్‌లు ఉండగా.. మూడు బ్లాక్‌ల్లో ఎలక్ట్రికల్, మెడికల్ వ్యర్థాలు, శానిటరీ ప్యాడ్లు సేకరిస్తామని, మరో మూడింట్లో తడి, పొడి వేరుగా చేసి సేకరించడం, ఇతర వ్యర్థాలను తీసుకుంటున్నట్లు అక్కడి అధికారులు వివరించారు. అలాగే, వ్యర్థాలన్నింటినీ రీసైక్లింగ్ యూనిట్లకు తరలిస్తామని, తడి వ్యర్థాలతో సేంద్రియ ఎరువు, బయోగ్యాస్ తయారీకి తరలిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ మూడు, నాలుగు డివిజన్లను జోనల్‌గా ఏర్పాటు చేసి 30 – 40 వాహనాల చెత్త సేకరిస్తూ డివిజన్‌కు 30 మంది కార్మికులను నియమించినట్లు వెల్లడించారు. చెత్త సేకరణ బాధ్యతను ఎన్జీవోలకు అప్పగించడంతో ప్రతీ ఇంట పక్కాగా చెత్త సేకరణ జరుగుతోందని, వాహనాలను ట్రాకింగ్ చేసేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఇండోర్ అధికారులు తెలిపారు. అలాగే, చెరువులు, కాల్వల ఆధునికీకరణ, రోడ్ల విస్తరణ పనులను కూడా మేయర్ బృందం పరిశీలించింది. అనంతరం ఇండోర్ మేయర్ పుష్యమిత్ర భార్గవ్‌తో భేటీ అయిన ఖమ్మం బృందం పలు అంశాలపై చర్చించారు. ఆదాయ వనరులు, వ్యయాలు, పాలన, పౌర సేవల వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా మేయర్ నీరజ మాట్లాడుతూ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌ను స్వచ్ఛత నగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని అనుకూలతలు ఉన్నాయని తెలిపారు. ఇండోర్ స్టడీ టూర్‌లో పరిశీలించిన అంశాలను ఇక్కడ అమలుకు అధికారులతో చర్చిస్తామని తెలిపారు.

హెచ్‌ఎంలుగా అక్కాచెల్లెళ్లు!

ఒకేసారి ఇద్దరికి పదోన్నతి



దుర్గాభవాని



బాధ్యతలు స్వీకరిస్తున్న ఉషారాణి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ ఉపాధ్యాయుల(ఎస్‌ఏ)కు గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించారు. ఈ సందర్భంగా అక్కాచెల్లెళ్లకు ఒకేసారి పదోన్నతి లభించింది. వీరిద్దరూ ఒకేసారి ఉపాధ్యాయులుగా విధుల్లో చేరడం, ఆపై ఎస్‌ఏలుగా పదోన్నతి పొందగా ఇప్పుడు ఒకేరోజు హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి పొందడం విశేషం. అక్క చావా ఉషారాణి, చెల్లె చావా దుర్గాభవాని 1993 జూన్ 14న ఎస్‌జీటీలుగా ఖమ్మం అర్బన్ యూపీఎస్, ఖమ్మం జీహెచ్‌ఎస్ మోమినాన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆపై స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొంది కూసుమంచి మండలం నేలపట్ల, చింతకాని మండలం నేరడ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిద్దరు శుక్రవారం గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందగా, దుర్గాభవాని ఎన్నెస్పీ కాలనీ, నయాబజార్ పాఠశాలలో ఉషారాణి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

80మందికి హెచ్‌ఎంలుగా పదోన్నతి



ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని వివిధ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు(ఎస్‌ఏ)లుగా విధులు నిర్వర్తిస్తున్న 80మందికి గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా పదోన్నతి లభించింది. ఈమేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేయగా పలువురు నూతన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించారు. అయితే, ఏడుగురికి ఆదిలాబాద్ వంటి సుదూర ప్రాంతాల్లో పోస్టింగ్ రావడంతో ప్రమోషన్ తీసుకోమని డీఈఓ కార్యాలయంలో లేఖలు అందజేశారు. ఇక ఎస్‌జీటీల్లో స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతికి అర్హులైన ఉపాధ్యాయుల సీనియారిటీ, ఖాళీల జాబితాను శనివారం విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాథమిక జాబితాపై శుక్రవారం అభ్యంతరాలు స్వీకరించగా తుది జాబితా శనివారం విడుదల చేస్తారు. కాగా, డీఈఓ కార్యాలయంలో ఇటీవల ఏఎంఓ బాధ్యతలు చేపట్టిన రాజశేఖర్‌కు గ్రేడ్–2 హెచ్‌ఎంగా పదోన్నతి లభించింది. దీంతో ఆయన ఇక్కడ రిలీవ్ అయి మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఏఎంఓ స్థానాన్ని ఒకటి, రెండు రోజుల్లో భర్తీ చేయనున్నట్లు తెలిసింది.

నేడు ప్రభుత్వ పాఠశాలల్లో నో బ్యాగ్ డే!

వైరా: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతీనెల నాలుగో శనివారం 'నో బ్యాగ్ డే' నిర్వహించాలన్న కలెక్టర్ ఆదేశాలు నేటి నుంచి అమల్లోకి రానున్నాయి. ఎస్‌సీఈఆర్‌టీ నిబంధన మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలకు విద్యార్థులు బ్యాగ్, పుస్తకాలు లేకుండా హాజయ్యేలా ఉపాధ్యాయులు సూచనలు చేశారు. ఈమేరకు శనివారం ఆటపాటలతో పాటు చిత్రలేఖనం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు కూడా అందించనున్నారు. అంతేకాక పిల్లల ఆటపాటలు, పోటీలను సెల్‌ఫోన్ల ద్వారా రికార్డు చేయాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు.

కూనంనేని.. మరోసారి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా రెండోసారి ఎన్నిక
- రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా నేతలకు స్థానం



కూనంనేని సాంబశివరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా రెండోసారి ఎన్నికయ్యారు. మేడ్చల్ జిల్లా గాజుల రామవరంలో పార్టీ రాష్ట్ర మహాసభలు జరుగుతుండగా శుక్రవారం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఈమేరకు కూనంనేని మరోమారు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆయన ఐదు దశాబ్ధాలుగా సీపీఐలో కీలపాత్ర పోషిస్తున్నారు. 2005 నుండి 2009 వరకు ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2009లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోటీ చేసి అప్పటి రాష్ట్ర మంత్రి వనమా వెంకటేశ్వరరావుపై విజయం సాధించి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆతర్వాత 2023లో ఎన్నికల్లోనూ బరిలోకి దిగిన కూనంనేని గెలిచారు. రాష్ట్ర కార్యదర్శిగా గత మూడేళ్లలో రంగారెడ్డి, వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, మేడ్చల్, మహబూబాబాద్ తదితర జిల్లాలో భూపోరాటాల ద్వారా పేదలకు ఇళ్ల స్థలాలు, సాగుభూముల పంపిణీలో కీలకంగా వ్యవహరించారు. రాష్ట్రంలో వామపక్షాల నుంచి ఏకైక ఎమ్మెల్యేగా కొనసాగుతున్న కూనంనేని 2023లో జరిగిన సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీపీఐ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘంగా విజయానికి కృషి చేశారు.

రాష్ట్ర కమిటీలో 13 మందికి చోటు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కూనంనేని సాంబశివరావు ఎన్నికవడమే కాక రాష్ట్ర కార్యవర్గంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నేతలు పలువురికి స్థానం దక్కింది. జిల్లా నుంచి ముగ్గురు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, పది మంది రాష్ట్ర సమితిలో చోటు దక్కించుకున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్‌పాషా, నాయకులు ముత్యాలు విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. అలాగే, రాష్ట్ర సమితి సభ్యులుగా కె.సారయ్య, మున్నా లక్ష్మీకుమారి, నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, వై.ఉదయ్‌భాస్కర్, ఎస్‌డీ.సలీం, రావులపల్లి రవికుమార్, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్రకుమార్ ఎన్నిక కాగా, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నుంచి మిర్యాల రంగయ్య రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా మౌలానా



ఖమ్మం మయూరిసెంటర్: సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా మహమ్మద్ మౌలానా రెండోసారి ఎన్నికయ్యారు. సీపీఐ రాష్ట్ర మహాసభల్లో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా మౌలానా ఎన్నికపై పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

బియ్యం పంపిణీకి సిద్ధం

మూడు నెలల తర్వాత వచ్చే నెల సరఫరా

- ఈసారి కొత్త కార్డుదారులకూ కోటా
- జిల్లాలో 21,925 కొత్తకార్డులకు బియ్యం కేటాయింపు



ఖమ్మం సహకారనగర్: రేషన్‌షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ వచ్చే నెల నుంచి యథావిధిగా మొదలుకానుంది. వర్షాలు, వరదల ప్రభావంతో ఇబ్బందులు ఎదురుకాకుండా జూన్, జూలై, ఆగస్టు కోటాను జూన్ నెలలోనే పంపిణీ చేసిన విషయం విదితమే. ఇక సెప్టెంబర్ కోటాను అదే నెల 1వ తేదీ నుంచి పంపిణీ చేసేలా పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో లబ్ధిదారుడికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేయనున్నారు.

దుకాణాలకు సరఫరా

జిల్లాలో వచ్చేనెల 1వ తేదీ నుంచి బియ్యం పంపిణీ మొదలుకానుంది. దీంతో ఇప్పటికే ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేస్తున్నారు. జిల్లాలో 748 రేషన్ షాప్‌లు ఉండగా.. ఇప్పటి వరకు 150దుకాణాల వరకు బియ్యం చేరవేశామని అధికారులు తెలిపారు.

రేషన్‌షాపులు, కార్డులు, లబ్ధిదారులు

రేషన్ దుకాణాలు	748
ఆహార భద్రత కార్డులు	4,25,542
అంత్యోదయ కార్డులు	27,213
అన్నపూర్ణ కార్డులు	03
లబ్ధిదారులు	12,71,723
బియ్యం	81,45,723 కిలోలు

కొత్తగా 41,615 రేషన్‌కార్డులు

ప్రజాపాలన సభల్లో స్వీకరించిన దరఖాస్తులకు తోడు మీ సేవ కేంద్రాల ద్వారా అందిన దరఖాస్తుల ఆధారంగా అర్హులకు కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నారు. ఇదేసమయాన కార్డుల్లో కొత్త పేర్లు సైతం నమోదు చేశారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటి వరకు 41,615 కార్డులు జారీ చేయగా, 1,42,601 లబ్ధిదారులకు లబ్ధి జరిగింది. మే నెల వరకు కార్డులు అందిన వారికి మూడు నెలల బియ్యాన్ని జూన్‌లో సరఫరా చేశారు. ఇక జూన్, జూలై, ఆగస్టు నెలల్లో 21,925 కొత్తకార్డులు మంజూరు చేయగా, వీరికి వచ్చే నెల నుంచి బియ్యం పంపిణీ చేస్తారు.

నెల నెలా పంపిణీ



రేషన్‌కార్డు లబ్ధిదారులకు సెప్టెంబర్ నుంచి యథావిధిగానే నెలనెలా బియ్యం పంపిణీ చేస్తాం. ఇప్పటికే సెప్టెంబర్ కోటా బియ్యాన్ని రేషన్ దుకాణాలకు చేరవేస్తున్నాం. 1వ తేదీ నుంచి గతంలో మాదిరిగానే పంపిణీ మొదలవుతుంది.

– చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి

క్లుప్తంగా

ఐడియాథాన్‌లో మెరిసిన డిగ్రీ కళాశాల విద్యార్థినులు



న్యాయనిర్ణేతలతో గిరిజన మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

కొణిజర్ల: హైదరాబాద్‌లో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ(డీఈఈటీ) ఆధ్వర్యాన నిర్వహించిన ఐడియాథాన్‌లో కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీకళాశాల విద్యార్థినులు సత్తాచాటారు. కళాశాలకు చెందిన ఎం.విజయలక్ష్మి, కీర్తన, దివ్య 'కవచ్' పేరుతో అనారోగ్యంతో ఉన్నప్పుడు హెచ్చరికలు జారీచేసే రిస్ట్ బ్యాండ్‌ను, కొత్తప్రాంతాల్లో చిరునామా తెలుసుకునేలా 'ఏకం' పేరిట 'వాయిస్ అసిస్టెంట్ ఫర్ ద పీపుల్ బై ట్రావెలింగ్' లొకేషన్ మ్యాప్‌ను సీహెచ్.కావ్య, ఐశ్వర్య, శరణ్య ప్రదర్శించారు. ఈ ఆవిష్కరణలను అభినందించిన న్యాయనిర్ణేతలు విద్యార్థినులకు టాప్–25 జాబితాలో చోటు కల్పించారు. విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ కె.రజని, వైస్ ప్రిన్సిపాల్ ఎం.నవ్య, కోఆర్డినేటర్లు కే.పీ.ఐశ్వర్య, దీప్తి, అధ్యాపకులు అభినందించారు.

గొల్లపూడి జీపీ కార్యదర్శి సస్పెన్షన్

రూ.2 లక్షల దుర్వినియోగంతో చర్యలు

వైరారూరల్: వైరా మండలంలోని గొల్లపూడి గ్రామపంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గొల్లపూడి పరిధిలో సీసీరోడ్లు తదితర అభివృద్ధి పనులకు సంబంధించి రూ.7 లక్షల నగదు ఎన్ఆర్ఈజీఎస్ ఖాతాలో జమ కాగా ఆ నిధులను డ్రా చేసి పంచాయతీ ఖాతాలో జమ చేయాల్సి ఉంది. కానీ పంచాయతీ కార్యదర్శి తోట సునీత రూ.7 లక్షలు డ్రా చేసినా జీపీ ఖాతాలో రూ.5 లక్షలే జమచేసింది. దీంతో విచారణ చేపట్టగా రూ.2 లక్షల నగదు దుర్వినియోగమైనట్లు తేలడంతో సునీతను సస్పెండ్ చేశారు. అలాగే, పంచాయతీ ప్రత్యేకాధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కృష్ణచైతన్యకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

స్పెషల్ డ్రైవ్‌లో 55 మోటార్‌సైకిళ్లు సీజ్

తల్లాడ: తల్లాడలో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న 55 మంది మోటార్ సైకిళ్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించడమే కాక అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

తల్లాడ: ప్రజలు ఇళ్లలోనే కాక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా వ్యాధులు దరిచేరవని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి చందునాయక్ తెలిపారు. తల్లాడ పీహెచ్‌సీని శుక్రవారం తనిఖీ చేసిన ఆయన మండలంలోని మిట్టపల్లిలో ఫీవర్ సర్వేనుపరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది సమష్టిగా పారిశుద్ధ్య సమస్య ఏర్పడకుండా చూడాలని తెలిపారు. ఇదేసమయాన ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యులు మౌనిక, గోపి, ఉద్యోగులు నవీన్‌కుమార్, కె.పెద్దపుల్లయ్య, రామ, రాజశ్రీ, పద్మ పాల్గొన్నారు.

కమిషనర్ వచ్చారు.. వెళ్లారు!

వైరా: వైరా మున్సిపల్ కమిషనర్ బదిలీ వ్యవహారంలో హైడ్రామా నెలకొంది. ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న చింతా వేణునునల్లగొండ జిల్లా నందికొండకు, అక్కడి కమిషనర్ యు.గురులింగంను వైరాకు బదిలీ చేస్తూ ఇటీవల ఉత్తర్వులు విడుదలయ్యాయి. దీంతో గురులింగం శుక్రవారం బాధ్యతలు స్వీకరించాక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌ను కలిసేందుకు కారేపల్లి వెళ్లారు. అయితే, పలువురు కాంగ్రెస్ నాయకులు కమిషనర్‌గా వేణునే కొనసాగించాలని ఎమ్మెల్యేను కోరడంతో ఆయన గురులింగంను రెండు నెలలు ఆగాక రావాలని సూచించినట్లు సమాచారం. దీంతో వేణు బదిలీ ఆగిపోగా, గురులింగం అసంతృప్తితో వెనుదిరిగినట్లు తెలిసింది. కారణాలు ఏమైనా కమిషనర్ల బదిలీ ఆగిపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,600	6,451
కందులు	5,950	5,650
ఏసీ మిర్చి	15,400	8,000
ఏసీ మిర్చి తాలు	8,800	8,000
మిర్చి	10,000	6,000
పత్తి	7,700	6,500

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.18,052

సర్వేలతోనే సరి..

- వసతిగృహాలు, గురుకులాల్లో పరిష్కారం కాని సమస్యలు
- నిధులు లేక మరమ్మతుకు నోచుకోని భవనాలు
- గిరిజన శాఖలో మెస్ బిల్లులు రాక ఏడు నెలలు
- మరోసారి సర్వేకు సిద్ధమవుతున్న యంత్రాంగం



ముస్తఫానగర్ వసతిగృహంలో ఊడిపోతున్న బాత్‌రూమ్ తలుపులు



శిథిలావస్థకు చేరుతున్న ఖమ్మం ముస్తఫానగర్‌లోని గిరిజన సంక్షేమశాఖ పీఎంహెచ్ వసతిగృహం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావడం లేదు. అధికారులు సర్వేల పేరుతో కాలం గడుపుతూ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. గత నెల 29, 30వ తేదీల్లో జిల్లాలోని అనేక సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలను అధికారులు సందర్శించారు. అక్కడి సమస్యలను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించారు. అయినా ఇప్పటికీ వీటిని పరిష్కరించకపోగా వసతిగృహాల సంక్షేమ అధికారులకు మెమోలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మళ్లీ మరోసారి సర్వేకు సిద్ధమవుతుండడంతో పరిష్కారం ఎప్పుడు జరుగుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అన్నీ సమస్యలే..

ప్రభుత్వం పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలను ఏర్పాటు చేసింది. కానీ, నిర్వహణలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు పెరుగుతున్నాయి. విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడం, తాగునీటి సౌకర్యాలు లేకపోవడం, గదులు ఇరుకుగా ఉండడం తదితర సమస్యలు వేధిస్తున్నాయి.

దాటవేత ధోరణి

గత నెలలో అధికారులు వసతి గృహాలను, గురుకులాలను పరిశీలించగా గుర్తించిన సమస్యలపై జిల్లా అధికారులకు నివేదికలు అందజేశారు. చాలా వసతిగృహాలకు డోర్లు, మెష్ డోర్లు, కిటికీలకు తలుపులు, బాత్‌రూమ్‌లు సరిగ్గా లేకపోవడం, తాగునీరు అందకపోవడాన్ని గుర్తించారు. వీటి పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కానీ, మరోమారు ఈ నెల 21, 22వ తేదీల్లో సర్వే చేయించడం గమనార్హం. గతంలో గుర్తించిన సమస్యలను పక్కనపెట్టి మరోమారు సర్వేతో ప్రయోజనం ఏమిటని విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

ప్రతిపాదనలు బుట్టదాఖలే..

జిల్లాలోని బీసీ వసతిగృహాల్లో మరమ్మతుల కోసం రూ.20.10 లక్షలు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖ వసతిగృహాల్లోనూ సమస్యలు వేధిస్తున్నాయి. మధిరలోని ఎస్‌టీహెచ్ (షెడ్యూల్డ్ ట్రైబ్ హాస్టల్), ముదిగొండ మండలం వల్లభిలోని ఆశ్రమ పాఠశాల, తిమ్మారావుపేట ఎస్‌టీహెచ్, ఖమ్మం, ఖమ్మంరూరల్ పోస్టుమెట్రిక్ కాలేజీల్లో పూర్తిస్థాయి మరమ్మతులు చేయించేందుకు ప్రతిపాదనలు చేశారు. ఎస్సీ వసతి గృహాల్లో కూడా వసతులు సక్రమంగా లేవు. జిల్లాలోని 52 వసతిగృహాల్లో మరమ్మతులకు రూ.2,42,11,000 అవసరమని ప్రతిపాదిస్తే ఇవన్నీ బుట్టదాఖలయ్యాయే తప్ప ఒక్క రూపాయి మంజూరు కాలేదు.

బిల్లులు అందక ఏడు నెలలు..

వసతిగృహాల మరమ్మతులకు నిధులు లేక కునారిల్లుతుంటే.. మరోపక్క విద్యార్థుల మెస్ బిల్లులు కూడా రావడం లేదని తెలుస్తోంది. గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించిన వసతిగృహాలకు ఫిబ్రవరి నుంచి బిల్లులు పెండింగ్ ఉన్నాయి. దీంతో విద్యార్థులకు భోజనం అందించడంలో ఇక్కట్లు ఎదురవుతున్నాయని తెలుస్తోంది. మెస్ బిల్లులు రాక.. వసతిగృహాల మరమ్మతులకు నిధులు రాక వసతిగృహాల సంక్షేమ అధికారులు ఇబ్బంది పడుతున్నారనే చర్చ జరుగుతోంది.

నిధులు కేటాయించాలి..



సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. మరమ్మతులు చేపట్టక భవనాలు శిథిలమయ్యాయి. ఇకనైనా ప్రత్యేక నిధులు కేటాయించి మరమ్మతులు పూర్తి చేయించాలి. కొన్నిచోట్ల టాయిలెట్లు బాగా లేవని తెలిసినా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదు.

–వి.వెంకటేశ్, జిల్లా కార్యదర్శి, పీడీఎస్‌యూ

మరమ్మతులు తప్పనిసరి



ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల్లో అవసరమైన మరమ్మతులు వెంటనే చేయించాలి. చాలా భవనాలు శిథిలా వస్థకు చేరాయి. అధికారుల సర్వేల్లో లోపాలను గుర్తించి నివేదికలు ఇచ్చినా చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయించాలి.

–టి.ప్రవీణ్, జిల్లా కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ

ఆక్రమిత స్థలాల స్వాధీనం



ఆక్రమిత స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు

మధిర: మధిర మున్సిపాలిటీ పరిధిలోనిని హిందూ శ్మశాన వాటిక స్థలంతోపాటు ప్రభుత్వ డొంకలో ఆక్రమణకు గురైన ఖాళీ స్థలాలను రెవెన్యూ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. సర్వేనెంబర్ 425, 427, 429, 430లోని డొంక స్థలం, 424 సర్వే నంబర్‌లోనిహిందూ శ్మశాన వాటిక కొంత మేర ఆక్రమణకు గురికాగా సర్వే అనంతరం స్వాధీనం చేసుకుని మున్సిపాలిటీకి అప్పగించారు. ప్రభుత్వ డొంకలోఆరుగురు 3,245 గజాలను, శ్మశాన వాటికలో ఐదుగురు 2,158 గజాల ఖాళీ స్థలాన్ని ఆక్రమించినట్లు తేల్చారు. అలాగే, శ్మశాన వాటికలోని కొంత స్థలాన్ని ఆక్రమించుకుని నివసిస్తున్న పేదలకు బీపీఎల్ కోటాలో రెగ్యులరైజేషన్‌కు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక ఓ పాఠశాల యజమాని ప్రభుత్వ డొంకలో 2,040 గజాలు, శ్మశాన వాటికలో 370 గజాలు, మరో పాఠశాల యజమాని 705 గజాల స్థలాన్ని ఆక్రమించినట్లు తేల్చగా, ఇంకో కాంట్రాక్టర్ 450 గజాల స్థలాన్ని ఆక్రమించి ఇళ్ల నిర్మించినట్లు గుర్తించారు. ఈమేరకు ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. అయితే, వారు కోర్టుకు వెళ్లగా అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించారు.

అక్రమంగా తరలిస్తున్న గోవులు పట్టివేత

వైరా: ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న గోవులను శుక్రవారం వైరా పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు శుక్రవారం వైరా రింగ్‌రోడ్డు సెంటర్‌లో వాహనాల తనిఖీ చేస్తూ ఏపీలోని హనుమాన్ జంక్షన్ నుండి హైదరాబాద్‌కు వెళ్తున్న మినీ వ్యాన్‌ను ఆపారు. అందులో పరిశీలించగా గోవులు ఉండడం, డ్రైవర్‌వద్ద ఎలాంటి పత్రాలు లేకపోవడంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి గోవులను ఖమ్మం టేకులపల్లిలోని గోశాలకు తరలించినట్లు ఎస్సై రామారావు తెలిపారు. తనిఖీల్లో ట్రైనీ ఎస్సై పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇనుప గేట్ల చోరీ నిందితుల అరెస్టు

తిరుమలాయపాలెం: మండలంలోని గోల్‌తండా సమీపాన ఈ నెల 7న వ్యవసాయక్షేత్రంలో ఇనుప గేట్లను చోరీ చేసిన ముగ్గురిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. ఖమ్మం వికలాంగుల కాలనీకి చెందిన ధనగుల కోటేశ్వరరావు, ఆయన భార్య రేణుక, బంధువు సుజాత కలిసి టాటా ఏస్ వాహనంలో గేట్లను తీసుకెళ్తూ ఎదుళ్లచెరువు సమీపాన పొదల్లో దాచారు. శుక్రవారం వీటిని వాహనంలో తరలిస్తుండగా పిండిప్రోలు వద్ద వాహన తనిఖీల్లో పట్టుబడ్డారని పోలీసులు తెలిపారు.

సెంట్రింగ్ షీట్ల చోరీ కేసులో ముగ్గురు..

ఖమ్మంఅర్బన్: సెంట్రింగ్ షీట్ల చోరీ కేసులో ముగ్గురిని ఖానాపురం హవేలీ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఖమ్మం అర్బన్ మండలం గొల్లగూడెం రోడ్డులో గురువారం తనిఖీ చేస్తుండగా వాహనంలో భవన నిర్మాణ పనులకు వినియోగించే రూ.40 వేల విలువైన 30 సెంట్రింగ్ షీట్లు లభించాయి. అందులో ఉన్న చింతకాని మండలానికి చెందిన అరవింద్, ఎస్.వీరబాబు జి.గోపిని విచారించగా చోరీని అంగీకరించారు. గతంలోనూ వీరిపై చోరీ కేసులు ఉన్నందున కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ ట్రక్కుల దొంగ..

చింతకాని: చింతకాని, కొణిజర్ల మండలాల్లో ట్రాక్టర్ ట్రక్కులను చోరీ చేసిన ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం డబ్బాకుపల్లి గ్రామానికి చెందిన చింతల నరేంద్రను చింతకాని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ నాగుల్‌మీరా కథనం మేరకు.. బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్)కు చెందిన ధర్మపురి పుల్లారావు ట్రాక్టర్‌ను తన స్నేహితుడైన చింతకాని మండలం ప్రొద్దుటూరు వాసి పాసంగులపాటి విష్ణువర్ధన్‌కు ఇచ్చాడు. అక్కడ ఈ నెల 15న ట్రక్కు చోరీ జరిగింది. పోలీసులు దర్యాప్తు చేస్తుండగా, మత్కేపల్లి క్రాస్ వద్ద గురువారం చేపట్టిన తనిఖీల్లో బోనకల్ వైపు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆపేందుకు ప్రయత్నించారు. అయితే, పోలీసులను చూసి వెనక్కి తిప్పుకునే క్రమంలో అడ్డుకోగా, చింతల నరేంద్ర, ఆయన స్నేహితుడు మువ్వల ఉదయ్ కిరణ్‌తో కలిసి ప్రొద్దుటూరులో రెండు, కొణిజర్ల మండలం పెద్దమునగాలలో ట్రక్కును చోరీ చేసినట్లు అంగీకరించాడు. రూ.4.60 లక్షల విలువైన ట్రక్కులు స్వాధీనం చేసుకుని నరేంద్రను అరెస్ట్ చేశామని, ఉదయ్ పరారీలో ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ–2 సారయ్య, ఏఎస్సైలు సువర్ణబాబు, లక్ష్మణ్‌చౌదరి పాల్గొన్నారు.

కృత్రిమ మేథకు బానిసలుగా మారొద్దు

ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు



గరికపాటిని సన్మానిస్తున్న చైర్మన్ గుండాల కృష్ణ

ఖమ్మం సహకారనగర్: విద్యాభివృద్ధి, సమాజాభివృద్ధిలో కీలకంగా నిలవాల్సిన విద్యార్థులు కృత్రిమ మేథకు బానిసలుగా మారొద్దని ప్రముఖ ప్రవచన కర్త గరికపాటి నరసింహారావు సూచించారు. ఖమ్మంలోని ఎస్‌టీఐటీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కృత్రిమ మేధను అవసరానికి వినియోగించుకోవాలే తప్ప పూర్తిగా ఆధారపడొద్దని తెలిపారు. అలాగే, మంచి అలవాట్లు, నిరంతరం అభ్యాసంతో ఫలితాలు సాధించాలని చెప్పారు. అనంతరం కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ, సెక్రటరీ, కరస్పాండెంట్ జి.ధాత్రి మాట్లాడగా అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, శివప్రసాద్, జె.రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'భగీరథ' సిబ్బంది విధుల బహిష్కరణ

నేలకొండపల్లి/వైరా: మూడు నెలలుగా వేతనాలు అందనందున శుక్రవారం అర్ధరాత్రి నుంచి విధులు బహిష్కరిస్తున్నట్లు మిషన్ భగీరథ కార్మికులు ప్రకటించారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాలో ఫిట్టర్లు, ఎలక్ట్రీషియన్లు, పంపు ఆపరేటర్లు, వాల్ ఆపరేటర్లు, హెల్పర్లు కలిపి 463 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి మూడు నెలలుగా రూ.3 కోట్ల మేర వేతనం బకాయి ఉంది. ఈ విషయమై 12న అధికారులతో జేఏసీ నాయకులు చర్చిస్తే 21లోగా వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అయినా ఫలితం లేక శుక్రవారం అర్ధరాత్రి నుంచి విధులు బహిష్కరణకు తీర్మానించారు. దీంతో శనివారం నుంచి జిల్లాలో తాగునీటి సరఫరాలతో సమస్య ఎదురవుతాయని భావిస్తున్నారు. కాగా, విధుల బహిష్కరణ విషయాన్ని జేఏసీ నాయకుడు మద్దెల రవి వెల్లడించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చింతకాని: మండలంలోని సీతంపేటకు చెందిన మేడ వెంకయ్య (49) ఇటీవల పురుగులమందు తాగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం పురుగుల మందు తాగగా కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందడంతో వెంకయ్య కుమారుడు జాషువా ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తి సమీపాన గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పంగిడికి చెందిన అజ్మీరా రాందాస్ (35) ఖమ్మం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా నియంత్రణ తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొనడంతో తీవ్రగాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రాందాస్ భార్య స్వరూప ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ..

కూసుమంచి: మండలంలోని గోపాలరావుపేటకు చెందిన కమ్మరికుంట్ల ఉమారాణి (25) ఈ నెల 3వ తేదీన భర్తతో గొడవపడి గడ్డిమందు తాగింది. ఆమెను ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఉమారాణి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

కట్లేరులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఎర్రుపాలెం: మండలంలోని కట్లేరు ప్రాజెక్టు వద్ద గుర్తు తెలియని పురుషుడి (45) మృతదేహాన్ని శుక్రవారం గుర్తించారు. మృతదేహంపై దుస్తులు లేవని, ఆయన ఆచూకీ తెలిసిన వారు 87126 59164, 87126 59165 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై రమేష్‌కుమార్ సూచించారు. కాగా, మృతదేహాన్ని మధిర ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

జ్వరంతో విద్యార్థులకు అస్వస్థత..

ప్రభుత్వాస్పత్రిలో కొనసాగుతున్న చికిత్స



ఆస్పత్రిలో ఒకే బెడ్‌పై నలుగురికి చికిత్స అందిస్తున్న దృశ్యం

సత్తుపల్లి: సత్తుపల్లి మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు జ్వరాల బారిన పడ్డారు. రెండు రోజులుగా జ్వరాలతో బాధపడుతున్న తొమ్మిది మందిని శుక్రవారం సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే, ఆస్పత్రిలో బెడ్లు సరిపడా లేక ఒక్కో పడకపై నలుగురికి చికిత్స అందిస్తున్నారు. కాగా, గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యాన మూడు రోజులుగా మైనార్టీ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి ఆర్.అవినాష్ తెలిపారు. అయితే, రెండురోజులుగా జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులను ఇళ్లకు పంపించకుండా పాఠశాలలోనే ఉంచడంతో పలువురికి తీవ్రత పెరగగా.. ఇంకొందరికి జ్వరం సోకిందని తెలిసింది.

బోనకల్ గురుకుల విద్యార్థినులకు..

బోనకల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిథులు జ్వరాల బారిన పడ్డారు. సుమారు 20మంది జ్వరంతో బాధపడుతుండగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావడంతో వైద్యాధికారి స్రవంతి చికిత్స చేశారు. ఇటీవల కురిసిన వర్షాలతో పాఠశాల ఆవరణలో నీరు నిలవగా దోమలు పెరిగి విద్యార్థినులు జ్వరాల బారిన పడినట్లు తెలిసింది.

పత్తి కొనుగోళ్లలో సీసీఐ కొత్తపంథా

- 'కాపాస్ కిసాన్' పేరిట ప్రత్యేక యాప్
- యాప్‌లో రిజిస్ట్రేషన్‌తో సీసీఐ కేంద్రాల్లో మద్దతు ధర



ఖమ్మంవ్యవసాయం: పత్తి కొనుగోళ్లలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఈసారి నూతన విధానం అమలుచేయనుంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందించేలా సీసీఐ 'కాపాస్ కిసాన్' యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌లో రైతులు రిజిస్ట్రేషన్ చేయించకుంటేనే సీసీఐ కేంద్రాల్లో పంట విక్రయించే అవకాశం ఏర్పడుతుంది. ఈనెల 30 నుంచి గుగూల్ ప్లే స్టోర్, యాపిల్ ఐఓఎస్ స్టోర్‌లో యాప్ అందుబాటులోకి రానుంది. ఈమేరకు రైతులు యాప్ డౌన్‌లోడ్ చేసుకుని భూమి పత్రాలు, పత్తి సాగు చేసినట్లు రెవెన్యూ శాఖ ధ్రువీకరణ, ఆధార్ కార్డులతో సెప్టెంబర్ 1నుంచి 30వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

పారదర్శకత, మద్దతు ధర

కేంద్ర ప్రభుత్వం పత్తికి నిర్ణయించిన మద్దతు ధర రైతులకు దక్కేలా సీసీఐ నూతన విధానం అమలుకు చర్యలు చేపట్టింది. గతంలో అనుసరించిన విధానంలో కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర ఎక్కువగా దళారులే దక్కించుకున్నారనే విమర్శలు వచ్చాయి. రైతుల నుంచి దళారులు కొనుగోలు చేసి బినామీల పేరిట పత్రాలతో సీసీఐ కేంద్రాల్లో అమ్ముతూ మద్దతు ధర పొందారనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యాన నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. ఫలితంగా క్వింటా పత్తికి నాణ్యత ఆధారంగా కేంద్రం ప్రకటించిన మద్దతు ధర గరిష్టంగా రూ. 8,110 రైతులకే దక్కేలా 'కాపాస్ కిసాన్' యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే యూరియా కొరత

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్ (ఖమ్మంమామిళ్లగూడెం): రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే యూరియా కొరత ఏర్పడగా.. ఈ విషయాన్ని పక్కన పెట్టి కేంద్రంపై అసత్య ప్రచారాలు చేయడం సరికాదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సహజంగా ఆగస్టులో యూరియా అవసరం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అయినా అడిగినంత మేర కేంద్రం సరఫరా చేయలేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చెప్పడం గర్హనీయమని పేర్కొన్నారు. బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై విమర్శలు చేయడాన్ని మానుకోవాలని సూచించారు. సమావేశంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు భూక్యా శ్యాంనాయక్, వేణుగోపాల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎం శ్రీ నిధులు సమర్థవంతంగా వినియోగించాలి

అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలలకు కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో శుక్రవారం సమావేశమైన ఆమె మాట్లాడారు. పీఎంశ్రీ నిధులతో చేపట్టిన పనులు, పాఠశాల నిర్వహణ గ్రాంట్ ద్వారా పూర్తిచేసిన పనులపై నివేదిక ఇవ్వాలని సూచించారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు దేశంలోని వివిధ ప్రాంతాల కళలు, సంస్కృతిపై అవగాహన కల్పించాలని తెలిపారు. డీఈఓ నాగ పద్మజ, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఆమోదంతోనే పశువుల కొనుగోలు

ఖమ్మంమయూరిసెంటర్: ఇందిరా మహిళా డెయిరీలో భాగంగా లబ్ధిదారుల ఆమోదంతో పాడి పశువులను కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళా డెయిరీలో మొదటి విడతగా 125 మంది సభ్యులకు రెండేసి పాడి పశువులు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం కమిటీ సభ్యులు లబ్ధిదారులతో నిర్దేశిత ప్రాంతాలకు వెళ్లి పశువులు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.నవీన్ బాబు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కస్తాల సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లికి చెందిన వత్సవాయి వెంకటేశ్వర్లు ఇంట్లో చోరీ జరిగింది. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి మూడు రోజుల కిందట ఖమ్మంలో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వగా వచ్చి చూసేసరికి బీరువా పగులగొట్టి ఉంది. ఈ మేరకు పోలీసులు చేరుకుని ఆధారాలు సేకరించారు. కాగా, రూ.67 వేల నగదుతో పాటు 15 తులాల వెండి, తులం బంగారు ఆభరణాలను చోరీ గురైనట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.